సమయం రాత్రి పన్నెండు దాటింది. చిక్కగా అలుముకున్న అమావాస్య చీకట్లో ఆ వీధి కుక్క భోరున ఏడుస్తోంది. డిస్కో డాన్సు చేస్తున్న నర్తకిలా గాలి అదుపు తప్పి హోరున వీస్తోంది. అప్పుడప్పుడు ఆకాశంలో మెరుపులు మెరుస్తూ సన్నగా పడ్తున్న చినుకులు భారీ వర్షంగా మారే సూచనలు కన్పిస్తున్నాయి.

# ఇరకాటం




తలుపు విరిగిపోయేలా బాదుతున్న శబ్దానికి శ్రీధర్‌కి నిద్ర మెలకువ వచ్చింది. సరిగ్గా తనింటి తలుపు దగ్గరే ఆ శబ్దం విన్పిస్తూంది. కప్పుకున్న శాలువా ప్రక్కన పడేసి మంచం దిగాడు. కరెంటు పోయి చాలాసేపయింది. మళ్ళీ రాలేదు. ఈ వాతావరణాన్ని బట్టి చూస్తే ఇప్పట్లో రాదేమో అనిపిస్తోంది. ఇల్లంతా చీకటిగా, నిశ్శబ్దంగా వుంది.

శ్రీధర్ ఇల్లు ఓ పెద్ద బంగళా. కుర్రవయసు, ఆఫీసర్ ఉద్యోగం. భార్య పిల్లంలో పుట్టింటికి వెళ్ళగా తనొక్కడే ఉన్నాడింట్లో.

ఇంతక్రితం వెలిగించిన కొవ్వొత్తి ఆయిపోయిందో, ఆరిపోయిందో తెలీలేదు. తలుపు మీద బాదుతున్న శబ్దం ఇంకా ఆగలేదు.

'తనకోసం ఇప్పుడెవరొస్తారు?' తీరని అనుమానం, సందేహం వచ్చాయి శ్రీధర్‌కి.

మధ్యాహ్నం రోడ్డుమీద జరిగిన ఘర్షణ వెంటనే గుర్తు వచ్చింది.

ఒక రౌడీ వెధవ నిలిపివున్న తన మోటారు సైకిల్‌ని రాంగ్ సైడ్ నుండి వచ్చి అతని సైకిల్‌తో ఢీకొట్టాడు. తత్ఫలితంగా అతని సైకిల్ ఫ్రంట్ రిమ్ వంకర్లు పోయింది. ఆ నష్టపరిహారం కట్టివ్వమని నానాగొడవ చేసాడు. మరీ పంతం పట్టాడు. తను ఉంటున్న పేట, తన గ్యాంగ్ పేరు చెప్పి భయపెట్టాడు. అయినా శ్రీధర్ చలించలేదు.

ఎవరికి ఎలాగైనా సరే ఆడబ్బులు రాబడ్తానని ప్రతిజ్ఞ చేసాడు. వాడు గొడవ చేసేకొద్దీ శ్రీధర్లోనూ పంతం పెరిగింది. నాతప్పేంలేదు, పైసా కూడా ఇవ్వను పొమ్మన్నాడు. రోడ్డుమీద పోగయిన జనంలోంచి ఎవరో వచ్చి సర్ది చెప్పి అతన్ని పంపేసారు.

'...బహుశా వాడేమయినా ఇప్పుడు తనింటి మీదికి......' ఆలోచన్లు మెదడ్ని తినేస్తున్నాయి.

ఇంకా తలుపు బాదుతున్న శబ్దం వస్తూనే ఉంది. ఆబాదుడికి తలుపులు ఊడిపడతాయేమో! కాలింగ్ బజర్ చెడిపోయి వారమయిందన్న సంగతి ఇప్పుడు గుర్తొచ్చింది.

ఇంట్లో తను ఒక్కడే ఉన్నాడు. అవకాశం చూసి గుండెలో ఓ విధమైన పిరికితనం చోటు చేసుకుంటోంది. 'ఇప్పుడు ఏమిటి చెయ్యటం?'

ఆకాశంలో తళుక్కున మెరుపు మెరిసింది. శ్రీధర్ బుర్రలో కూడా ఓ ఆయిడియా ......

వెంటనే పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసాడు. తనింటి అడ్రస్ చెప్పి వెంటనే బయలుదేరి రమ్మంటూ ఫోన్ పెట్టేసాడు. అయినా ఇంకా కంగారు తగ్గలేదు.

కిటికీలో నుండి చలిగాలి రివ్వున వీస్తోంది. శ్రీధర్ మొహానికి పట్టిన చెమట తుడ్చుకుని చీకట్లోనే ఫ్రిజ్ తెరిచి విస్కీ, సోడాలు తీశాడు. బ్లాక్‌డాగ్ సగం బాటిల్ ఖాళీ అయింది.

వంట్లో వేడి, కొద్ది పాటి ధైర్యం చోటుచేసుకున్నాయి. వెంటనే బీరువా లాక్ తీసాడు. సీక్రెట్ లాకర్‌లోంచి పిస్టల్ బయటికి తీసాడు. మరో చేతిలో త్రీసెల్ టార్చిలైటు పట్టుకుని బయలు దేరాడు. ఎటు తిరిగీ అటు నుంచి పోలీసులు వచ్చేస్తుంటారన్న ధీమా!

చేతిలో పిస్టల్‌ని నిబ్బరంగా పట్టుకుని, చాలా జాగ్రత్తగా తలుపు తీసి చిన్న సందులో నుండి పిల్లిలా తొంగి చూసాడు.

గొడుగు వేసుకుని, చలిగాలికి వణుకుతూ గుమ్మం ఎదురుగా నిలబడి వున్నాడు శ్రీధర్ స్నేహితుడు అప్పారావు.

అతన్ని చూడగానే శ్రీధర్లో భయం పూర్తిగా తొలగిపోయి ఆస్థానే విస్మయం కల్గింది. "ఏంటోయ్ అర్ధరాత్రి వేళ వచ్చావ్! ఏదైనా అర్జంటా?" ఆత్రుతగా అడిగాడు అప్పారావుని. ఎందుకంటే సాధారణంగా అతనెప్పుడూ బయట, ఆఫీసులోనే కలుస్తుంటాడు. ఇదే మొదటిసారి రావటం తనింటికి.

ఎప్పుడూ పొరపాటవని తన అంచనా ఇవాళ అనుకోకుండా తారుమారైంది. ఆ మనస్తాపంలో అతన్ని లోనికి రమ్మని పిలవాలనే ఇంగిత జ్ఞానం కూడా కోల్పోయాడు.

అప్పారావు మెల్లిగా గొంతు సవరించుకుని "ఏం లేదు. ఇవాళ నా పుట్టిన రోజు. ముందు ఈ స్వీటు అందుకో, విషయం తర్వాత చెప్తాను." అన్నాడు ఎంతో వినయంగా.

ఆ మాటలు వింటూనే శ్రీధర్లో కోపం భగ్గుమంది. 'ఇతన్ని ఆ రౌడీ వెధవ అనుకుని అనవసరంగా కంగారు పడ్డాను. పైగా పోలీసులకు ఫోన్ చెయ్యటం ఇతని మూలానే. అయినా ఈ అర్ధరాత్రి స్వీట్లు ఇవ్వటమేమిటి?!' విచిత్రంగా చూసాడతనివైపు.

అతన్ని చాచి లెంపకాయ కొట్టాలన్న కోపం కంటే, చేతిలో వున్న పిస్టల్‌తో ధమ్మని షూట్ చేసెయ్యాలన్నంత కోపం, కసి పుట్టుకొచ్చాయి.

అంత కోపాన్ని పళ్ళ బిగిన బలవంతాన నిలిపి "ఇప్పుడు నిద్రలేపి ఇవ్వకపోతే ఏం కొంపలంటుకుపోతాయ్! రేపొద్దున ఇవ్వొచ్చుగా..." విసుగ్గా అన్నాడు శ్రీధర్.

"అలా కోప్పడకోయ్! అసలు నేను పుట్టింది అర్ధరాత్రేనట. మా అమ్మగారు చిన్నప్పుడే చెప్పింది. అందుకని ప్రతి యేడులా సాయంత్రం పూట అందర్నీ ఆహ్వానించి పార్టీలు, కేకులు, డ్రింకులు ఇవన్నీ మాని 'థ్రిల్' కోసం, నేనే స్వయంగా ఇలా ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్తూ నా పుట్టిన రోజు పండుగని ఇలా జరుపుకుంటున్నాను. ఇంకా చాలా మంది ఇళ్లకు వెళ్ళాలి" అంటూ ఓ పాకెట్ శ్రీధర్ చేతిలో ఉంచి చీకట్లో కల్సిపోయాడు అప్పారావు.

వర్షంలో సగం తడుస్తూ చకచకా వెళ్ళిపోతున్న అప్పారావుని చూస్తూ ఉండిపోయాడు శ్రీధర్. కానీ అప్పుడే వీధి మలుపు తిరిగి ఇటువేపే వస్తున్న పోలీస్ జీప్‌ని ఇంకా గమనించలేదు. ●